ప్రజాశక్తి

శనివారం 25 మే 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

నికరంపల్లిలో ఇంటి పైకప్పు లేచిపోయిన గృహం

ఈదురుగాలుల బీభత్సం

పలు చోట్ల లేచిపోయిన ఇంటి పైకప్పులు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అల్పపీడన ప్రభావంతో శుక్రవారం పలు చోట్ల ఈదురుగాలులు వీచాయి. ఈదురు గాలుల కారణంగా ఇంటి పైకప్పులు లేచిపోయాయి. మార్కాపురం మండల పరిధిలోని నికరంపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దీంతోపాటుగా పెద్దఎత్తున ఈదురు గాలులు వీయడంతో గుండారెడ్డి నారాయణమ్మ ఇంటి పైకప్పు భాగంలో ఉన్న రేకులు ఎగిరిపోయి దాదాపు అర కిలోమీటర్ దూరంలో పడ్డాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు ఒక లక్షా యాభై వేల మేరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు నారాయణమ్మ వాపోయారు.

మొట్టుపల్లెలో లేచిపోయిన ఇంటి రేకులు

కొమరోలు: మండలంలోని మొట్టుపల్లె గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో విపరీతమైన ఈదురుగాలులు వీచాయి. ఈ గాలులకు గ్రామంలోని నాగం రమణయ్య, నాగం నాగార్జునలకు చెందిన నివాస గృహాల రేకుల కప్పు ఎగిరిపోయింది. దీంతో ఇంటిలోని వంట సామగ్రి, వివిధ వస్తువులు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

అందరి నోటా స్వల్ప మెజార్టీనే..

- గెలుపుపై అన్ని స్థానాల్లోనూ ఉత్కంఠే..
- దగ్గర పడుతున్న ఓట్ల లెక్కింపు గడువు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'మేము గెలుస్తాం.. దమ్ముంటే బెట్ పట్టుకోండి.. అయితే స్వల్పమెజార్టీతోనే బయటపడతాం...' ఇదీ ఇప్పుడు అభ్యర్థుల శిబిరాల నుంచి వినిపిస్తున్న మాటలు. ఏ నియోజకవర్గంలో అడిగినా నాలుగైదు వేల లోపు మెజార్టీతోనే తమ అభ్యర్థి గెలుస్తాడనుకుంటున్నామనే చర్చ పార్టీ కార్యకర్తల మధ్య సాగుతోంది. ఎందుకంటే ఓటింగ్ సరళి ఇప్పటికీ అభ్యర్థులకు అంతుచిక్కడం లేదు. తూర్పు ప్రాంతంలో కూటమికీ, పశ్చిమాన వైసిపి అభ్యర్థులకు అవకాశాలున్నాయనేది సాధారణ విశ్లేషణ. నియోజకవర్గాల్లో పార్టీలకు ఉన్న పునాదులు.. గతంలో గెలిచిన నేపథ్యం రీత్యా కొన్ని నియోజకవర్గాల్లో గెలుపు ఎవరిదనేది సుస్పష్టం.

ఈ ఎన్నికల్లో మారిన పరిస్థితుల రీత్యా వైసిపికి బలంగా ఉన్న రెండు నియోజకవర్గాల్లోనూ ఈసారి ట్రెండ్ మారిందంటున్నారు. అక్కడా స్వల్ప మెజార్టీ లపైనే ఉన్నారు. ఏదేమైనా ఉమ్మడి ప్రకాశంలో చెరి సగం గెలుస్తారనే ధీమాలు మాత్రం కనిపిస్తున్నాయి. ఎవరికి మొగ్గు ఉంటుందనేదీ చూడాలి. అందరూ ఫలితాల రోజు కోసం ఎదురు చూస్తున్నారు. వచ్చే నెల 4న కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. అభ్యర్థులు వారం రోజులు ఇతర ప్రాంతాల్లో విశ్రాంతిలో ఉన్నారు. కొందరు దేవాలయాలను సందర్శిస్తున్నారు. దైవదర్శనాల్లో ఉన్నారు. గెలుపు కోసం మొక్కులు తీర్చుకుంటున్నారు. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. వాటి నుంచి బయటకు తీసే రోజు కోసం అందరూ ఉత్కంఠగానే ఎదురు చూస్తున్నారు. ఈ సారి ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదైంది. ఎక్కడెక్కడ ఉన్న వాళ్లంతా వచ్చి ఓటేసి పోయారు. గతంలో ఇంత ఉత్సాహంగానూ పట్టుదలగా ఓటేయలేదు. ఈ ఓటు ఎటువైపు పడిందన్నదే స్పష్టత లేదు. సైలెంటు ఓటింగుపైనా గుంభనం కొనసాగుతోంది. ఎవరికి వారే తమకు అనుకూలంగా ఓటు పడిందని చెప్పుకుంటున్నారంతే.. ఓటర్లు మాత్రం ఎవరికి ఓటేసిందనదీ బయటకు చెప్పడం సాధ్యం కాదు. గ్రామాల్లో పార్టీ గ్రూపుల్లో ఉన్న వ్యక్తులను తప్ప సాధారణ జనాన్ని ఏదో ఒక వైపు వేసుకోవడం కష్టం. ఏదేమైనా ఈసారి భారీ మెజార్టీలు వినిపించడం లేదు. అందరినోటా స్వల్ప మెజార్టీలే వినిపిస్తున్నాయి. తెలుగుదేశం అభ్యర్థుల గెలుపు సునాయాసం అంటున్న కొండపి, సంతనూతలపాడు, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోనూ ఐదారు వేలలోపే మెజార్టీ అనే చర్చ వినిపిస్తోంది. ఒంగోలులో ఇద్దరూ గెలుపుపై ధీమాతో ఉన్నారు. గత ఎన్నికల్లో 23 వేల మెజార్టీతో గెలిచిన బాలినేని ఇప్పుడు ఆయన శిబిరం నుంచే 9,500 మెజార్టీ అంచనాలు వేశారు. వార్డులు, గ్రామాల వారీగా మెజార్టీలు లెక్కకట్టారు. తెలుగు దేశం అభ్యర్థి దామచర్ల కూడా 16 వేల మెజార్టీతో గెలుస్తారని ఆయన అనుచరులూ గణాంకాలు తీశారు. ఇందులో 8 వేలు పక్కా అంటున్నారు. ఇలా రెండు శిబిరాలూ స్వల్ప మెజార్టీలకు పడిపోయాయి. దర్శిలో ▶ 2లో

ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం

- కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం
- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, అదనపు సహాయ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా, ప్రతి ఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండి వారికి కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అందరూ సమగ్ర అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని, సిబ్బంది అంతా ఉదయం 5 గంటలకే తమకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు చేరుకొని, అంతా సిద్ధం చేసుకోవాలని సూచించారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈవిఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియతో పాటు సర్వీసు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై పూర్తి అవగాహన చేసుకొని తదనుగుణంగా సన్నద్ధం కావాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్లు అధిక సంఖ్యలో పోలవటంతో లెక్కింపు పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తొలివిడత లెక్కింపు, మలివిడత లెక్కింపు ప్రక్రియలను వివరించారు. సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిస్తామని, . ఈ నెల 25, 27 తేదీల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.

తొలుత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశల్లో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు, దర్శి, కనిగిరి, వై పాలెం, కొండపి, గిద్దలూరు అసెంబ్లీ నియోజక వర్గాల ఆర్‌ఒలు, ఏఆర్‌ఓ లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి కోసం..

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- మృతిచెందిన తమ్ముడు
- జాతీయ అన్నదమ్ముల దినోత్సవం రోజే వెలుగులోకి..

మృతిచెందిన శివశంకర్ (ఫైల్)

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆస్తి కోసం అన్నదమ్ములు రాళ్లతో దాడి చేసుకోగా తమ్ముడు మృతిచెందిన ఘటన జాతీయ అన్నదమ్ముల దినోత్సవమైన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది.

శింగరాయకొండ మండలం, మూల గుంటపాడు గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న చొప్పర శివకృష్ణ, చొప్పర శివశంకర్ అన్నదమ్ములు. వీరిద్దరి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా ఆస్తుల రగడ ఉంది. శివకృష్ణ సెంట్రల్ గవర్నమెంట్ రైల్వేలో టీసీగా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని తమ్ముడు శివశంకర్ పెయింట్ పనికి వెళుతూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా ఆస్తుల తగాదాలు ఉన్న నేపథ్యంలో గురువారం రాత్రి వెంకటేశ్వర కాలనీలోని వీరి నివాసం దగ్గర రాళ్లతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో అన్న శివకష్ణ చేతిలో చొప్పర శివశంకర్(36)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రైవేటు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. శివశంకర్ 108 వాహనంలో ఒంగోలుకు వెళుతున్న సమయంలో మార్గమధ్యలో మృతిచెందాడు. రాళ్ల దాడుల్లో శివశంకర్‌కు బలమైన గాయం తగలడంతో మృతిచెందడం జరిగిందని నిర్ధారించారు. ఘటనాస్థలాన్ని శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి శ్రీరామ్ సందర్శించారు. గొడవకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'పెద్దదోర్నాల'లో మెజారిటీ ఎవరికి?

కాకిలెక్కల్లో ఇరు పార్టీ నేతలు • క్యాడర్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ఉత్కంఠ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని పెద్దదోర్నాల మండలంలో మెజార్టీ ఓటర్లు ఎవరివైపు మొగ్గు చూపారన్న ఉత్కంఠ ఇటు టిడిపిలోనూ, అటు వైసీపీలోనూ వేడి పుట్టిస్తోంది. అయితే ఇరు పార్టీల నేతలు మాత్రం ఎవరికివారే కాకిలెక్కలు వేసుకుంటున్నారు. తమ పార్టీకే మెజార్టీ వస్తుందంటే, కాదు తమ పార్టీకే మెజార్టీ వస్తుందని డాంబికాలు పలుకుతున్నారు. ఆదిమూలపు సురేష్ ఐదేళ్ల పాటు మంత్రిగా ఉండి కూడా మంచినీటి సమస్య పరిష్కరించలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. సురేష్ నియోజకవర్గం మారినా ఆ ప్రభావం ప్రస్తుత యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌పై పడిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. దీంతో మంచినీటి సమస్య దెబ్బ వైసీపీకి గట్టిగానే తగిలిందనే భావన వ్యక్తమవుతోంది. అయితే పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల నీటి బిల్లులు మంజూరు చేయించడంలోనూ, ప్రభుత్వం ద్వారా ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించడంలోనూ వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ ముందున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. అయితే టీడీపీ నేతలంతా ఎలాంటి

విభేదాలు లేకుండా ఐక్యంగా పని చేశారు. కొన్ని గ్రామాలలో పార్టీ కోసం సొంత డబ్బులు సైతం ఖర్చు చేశారు. అధికార పార్టీకి ధీటుగానే డబ్బులు పంపిణీ చేశారు. టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకొని పావులు కదిపారు. వైసీపీ నాయకులు తమకు మండలంలో ఐదు వేలకు పైగా మెజార్టీ వస్తుందని చెబుతుండగా.. టిడిపి నేతలు మాత్రం తమకు దోర్నాల పట్టణంలోనే మూడు వేల దాకా మెజార్టీ వస్తుందని, మిగతా గ్రామాల్లో కూడా తమకే ఓట్లు పడ్డాయని చెబుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం ఏర్పడక ముందు పెద్దదోర్నాల మండలం మార్కాపురం నియోజకవర్గంలో ఉండేది. అప్పుడు ఈ మండలంలో టీడీపీకి గట్టి పట్టు ఉండేది. యర్రగొండపాలెం నియోజకవర్గం ఏర్పడిన తరువాత క్రమంగా మండలంలో టీడీపీ బలం తగ్గుతూ వచ్చింది. 2009లో కాంగ్రెస్‌కు, 2014, 2019 ఎన్నికల్లో వైసీపీకి మెజార్టీ వచ్చింది. దీంతో టీడీపీ నాయకులు గత మూడేళ్లుగా లోపాలను సరిచేసుకుంటూ వస్తున్నారు. మండలంలో పట్టు సాధించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగారు. చెంచు గూడేల్లో సైతం టీడీపీకి ఆదరణ లభించింది. గతంలో గూడేల్లో వైసీపీకి ఏకపక్షంగా ఓట్లు పడేవి. ఈ ఎన్నికల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, ప్రజలు టీడీపీ వైపు ఆకర్షితులయ్యారని అంటున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో టిడిపికి అనుకూల ఓటు పడిందని చెబుతున్నారు. దీంతో ఇరుపార్టీల నాయకులు మెజార్టీ తమదంటే తమదంటూ చర్చించుకుంటున్నారు. ఏ పార్టీకి మెజార్టీ వచ్చిందో తేలాలంటే జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

అందరి నోటా స్వల్ప మెజార్టీనే..

(మొదటిపేజీ తరువాయి)

నువ్వానేనా అన్నట్లుగానే ఉంది. వైసిపి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎడ్జ్‌లో ఉన్నట్లు చర్చ ఉంది. ఈయన కూడా మూడు నాలుగు వేలలోపేనంటున్నారు. తెలుగుదేశం అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి వర్గీయులూ రెండు వేలలోపు మెజార్టీతోనైనా గెలిచే అవకాశాలున్నాయంటున్నారు. ఇలా ఎవరికి వారే స్వల్ప మెజార్టీలతో బయటపడతామనే ఆశగా ఉన్నారు. గత ఎన్నికల్లో గిద్దలూరులో 80 వేలు రాగా కనిగిరి, వైపాలెం, దర్శిలో వైసిపి అభ్యర్థులకు 40వేలకు పైగానే వచ్చింది. అవన్నీ ఇప్పుడు తారుమారయ్యాయి. ఇప్పుడు పది వేల మెజార్టీ గ్యారంటీ అనే మాటే లేదు. ఏదేమైనా మరో వారం రోజులు ఈ ఉత్కంఠ తప్పేలా లేదు.

వేసవి శిక్షణా శిబిరానికి హాజరైన విద్యార్థులు

సృజనాత్మకను వెలికి తీసేందుకే శిక్షణ: ఐద్వా

ప్రజాశక్తి-సంతనూతలపాడు

పిల్లల్లో దాగి వున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తు న్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. ఐద్వా, జెవివి సంతనూతలపాడు మండల కమిటీల ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి భవిష్యత్‌లో వారు వివిధ రంగాల్లో రాణించేందుకు వీలుగా శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకురాలు ఐద్వా మండల కార్యదర్శి ఎన్ మాలతి మాట్లాడుతూ స్థానిక సుందరయ్య భవన్‌లో విద్యార్థులకు గత ఐదు రోజులుగా ఉచిత వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ఫన్ని మ్యాథ్స్, క్యారమ్, డ్రాయింగ్, నీతి కథలు, దేశభక్తి గీతాలు నేర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే మంచి ఆలోచనలు కలిగివుండాలని అన్నారు. శిబిరం ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

ప్రజలు శాంతియుతంగా మెలగాలి: సిఐ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఒకరినొకరు రెచ్చగొట్టుకునే విధంగా ప్రవర్తించకుండా శాంతియుతంగా మెలగాలని మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద నాగులవరం, రాయవరం గ్రామాల్లో మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోలీసులు అనుమానాస్పద ప్రాంతాల్లోని గృహాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పది మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదలతో గ్రామాలలో ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామాలలో కార్డెన్ సెర్చ్ ద్వారా గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, ఎన్నికల కోడ్ ఉండడంతో కౌంటింగ్ కేంద్రాల ప్రాంతాలకు వెళ్లకూడదన్నారు. ప్రజలు చట్టవ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు తిరిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం గ్రామీణ ఎస్ఐ ఎం వెంకటేశ్వర నాయక్, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు

పొగాకు కిలో అత్యధిక ధర రూ.321

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం గురవారెడ్డిపాలెం గ్రామ రైతులు 1165 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 1052 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 113 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.321 పలుకగా అత్యల్ప ధర రూ.205 పలికింది. సరాసరి కిలో ధర రూ.263.11 పలికింది. వేలంలో 24 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - వేమూరు

ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ సీజన్‌కు గాను పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అందించేందుకు సిద్ధం చేసినట్లు ఎఒ సిహెచ్ సునీత తెలిపారు. మండలం లోని జంపన గ్రామంలో శుక్రవారం 50శాతం రాయితీ పై పిల్లి పెసర, జనుము విత్తనాలు అందజేశారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వీటిని రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. పిల్లి పెసర కేజీ రూ.67, జనుము కేజీ రూ.44 చొప్పున అందిస్తున్నట్లు తెలి పారు. బాపట్ల వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఆర్ విజయ రాజు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను వెదజల్లిన అనంతరం 40రోజుల తర్వాత భూమిలో కలియదున్నాలని చెప్పారు. భూమిలో ఈ పైరు కుళ్లి భూసారాన్ని పెంచుతుందని తెలిపారు. రైతులు ప్రభుత్వం ద్వారా అందించబడే విత్తనాలు సద్వినియో గం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రాల విఎఎలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.ఎ.5/2024
ఇన్
ఇ.పి. 45/2019
ఇన్
ఓ.ఎస్. 172/2017
1) బసిరెడ్డి శ్రీనివాసరెడ్డి .... క్లయింపిటీషనర్
వర్సెస్
1) వెన్నా కాశిరెడ్డి మరియు ఇతరులు..రెస్పాండెంట్లు
టు,
ఆర్2.
పడుచూరి రమేష్‌బాబు, తండ్రి: శ్రీమన్నారాయణ
నివాసం: డోర్ నెం: 3-287, గోకుల్ వీధి,
మార్కాపురం టౌన్ అండ్ మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబరు క్లయిం పిటీషన్ రెస్పాండెంట్ల పైన పై కోర్టులో దాఖలు చేయగా కోర్టు వారు రెస్పాండెంట్లకు నోటీసులు జారీ చేయగా 2వ రెస్పాండెంట్‌కు నోటీసులు ముట్టని కారణంగా పేపరు ప్రకటనకు ఆర్డర్ వేసినారు. కావున తేదీ: 19-06-2024న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమందు తీర్మానించబడును.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా: 19-06-2024 ఇ.శారద
మార్కాపురం అడ్వకేట్,మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.ఎ.23/2024
ఇన్
ఇ.పి. 45/2019
ఇన్
ఓ.ఎస్. 172/2017
బొగ్గరపు శేషగిరిరావు .... క్లయిం పిటీషనర్
వర్సెస్
1) వెన్నా కాశిరెడ్డి మరియు ఇతరులు..రెస్పాండెంట్లు
టు,
ఆర్2.
పడుచూరి రమేష్‌బాబు, తండ్రి: శ్రీమన్నారాయణ
నివాసం: డోర్ నెం: 3-287, గోకుల్ వీధి,
మార్కాపురం టౌన్ అండ్ మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబరు క్లయిం పిటీషన్ రెస్పాండెంట్ల పైన పై కోర్టులో దాఖలు చేయగా కోర్టు వారు రెస్పాండెంట్లకు నోటీసులు జారీ చేయగా 2వ రెస్పాండెంట్‌కు నోటీసులు ముట్టని కారణంగా పేపరు ప్రకటనకు ఆర్డర్ వేసినారు. కావున తేదీ: 19-06-2024న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమందు తీర్మానించబడును.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా: 19-06-2024 ఇ.శారద
మార్కాపురం అడ్వకేట్,మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.ఎ.20/2024
ఇన్
ఇ.పి. 45/2019
ఇన్
ఓ.ఎస్. 172/2017
ఇనుపగోళ్ల అరణదీప్తి .... క్లయిం పిటీషనర్
వర్సెస్
1) వెన్నా కాశిరెడ్డి మరియు ఇతరులు...రెస్పాండెంట్లు
టు,
ఆర్2.
పడుచూరి రమేష్‌బాబు, తండ్రి: శ్రీమన్నారాయణ
నివాసం: డోర్ నెం: 3-287, గోకుల్ వీధి,
మార్కాపురం టౌన్ అండ్ మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబరు క్లయిం పిటీషన్ రెస్పాండెంట్ల పైన పై కోర్టులో దాఖలు చేయగా కోర్టు వారు రెస్పాండెంట్లకు నోటీసులు జారీ చేయగా 2వ రెస్పాండెంట్‌కు నోటీసులు ముట్టని కారణంగా పేపరు ప్రకటనకు ఆర్డర్ వేసినారు. కావున తేదీ: 19-06-2024న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమందు తీర్మానించబడును.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా: 19-06-2024 ఇ.శారద
మార్కాపురం అడ్వకేట్,మార్కాపురం.

అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A.NO 211/23
IN
E.P.NO 75/15
IN
O.S NO 19/14
బిట్వీన్
అద్దంకి వెంకట మల్లికార్జునరావు
..... పిటిషనర్ / డి.హెచ్.ఆర్
V/s
కాటసాని రాజనారాయణ రెడ్డి
...రెస్పాండెంట్ / జె.డి.ఆర్
To
కాటసాని రాజనారాయణ రెడ్డి
తండ్రి వెంకటసుబ్బారెడ్డి,
డోర్ నెం 130, వీధి నెంబర్ 700.
సాయి నగర్ అద్దంకి, అద్దంకి మండలం,
బాపట్ల జిల్లా
పై నెంబరు EP లోని DHR ఇందలి JDR పై అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఉన్న EP32/13 IN 39/13 రులో డిపాజిట్ కాబడి ఉన్న పైకమును పైనంబర్ EP లోనికి బదిలీ చేయించమని కోరి పిటిషను దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తేది 19-06-2024నికి వాయిదా గా ఉన్నది. కావున నీకేమైనా ఆక్షేపణలో ఉన్న ఎడల మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై తేదీన ఉదయం 10.30 ని.లకు హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడునని ఇందు మూలకముగా తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వులతో //
అద్దంకి ఇట్లు
తేది :24-05-2024 వెలగపూడి సుబ్రహ్మణ్యం
తరపు అడ్వకేట్,అద్దంకి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి

రూ.5 కోట్లు మంజూరు : ప్రిన్సిపల్

ప్రజాశక్తి -కనిగిరి

డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పిఎం ఉషా -2024 పథకం ద్వారా కనిగిరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఉషా రాణి తెలిపారు. ఉన్నత విద్య శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆదేశాల మేరకు శుక్రవారం సిపిడిసి సభ్యులు, కళాశాల సిబ్బంది,ఎపిఇడబ్ల్యు ఐడిసి ఇంజనీర్లతో ప్రిన్సిపల్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మంజూరైన నిధులతో కళాశాలలో నూతన తరగతి గదుల నిర్మాణం, పాత తరగతి గదులను పునరుద్ధరణ,భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాలు వైఫై కనెక్టివిటీ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. పిఎం ఉషా పథకం పథకం ద్వారా కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు మంజూరు అయ్యేందుకు ఎంతో కృషి చేసిన ఉన్నత విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ కు సిపిడిసి కమిటీ మరియు కళాశాల సిబ్బంది ఈ సందర్భంగా ప్రత్యేక

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల సిపిడిసి సభ్యులు, కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్, ముక్కు బాల కష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో వెనుకబడి ప్రాంతమైన కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విద్యా, మౌలిక సదుపాయాలు మెరుగు పరచడానికి రూ.5 కోట్లు మంజూరు చేయడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమని తెలిపారు. కనిగిరి పట్టణ పరిసర గ్రామీణ ప్రాంతలలోని ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రణాళిక మరియు అభివద్ధి కమిటీ సభ్యులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణ రెడ్డి, రాచమళ్ళ శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి ఎం. కస్తూరి రెడ్డి, సామాజిక కార్యకర్త గుడ్ హెల్ప్ ప్రతినిధి రమేష్ బాబు, కళాశాల అధ్యాపకులు ఐక్యూఎసి కోఆర్డినేటర్ డి.జయకుమారి, పిఎం ఉషా కోఆర్డినేటర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ మాల కొండయ్య, ఎపిఇడబ్ల్యు ఐడిసి ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత కార్యదర్శి ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడుకు చెందిన విశ్రాంత పంచాయతీ కార్యదర్శి ఇంటిలో చోరీ జరిగింది. విశ్రాంత పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ గత పది రోజుల క్రితం హైదరాబాదు వెళ్లాడు. ఊలపాడులో శ్రీ వేణుగోపాల స్వామి తిరునాళ్ల సందర్భంగా వారి కుమారుడు హైదరాబాదు నుంచి మూలగుంటపాడుకు శుక్రవారం వచ్చాడు. ఇంటి తలుపులు తీసేందుకు ప్రయత్నించగా తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించాడు. ఈ విషయం గురించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీరామ్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. దొంగలు తలుపు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువాలను పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బీరువాల్లోని సామగ్రి అంతా మంచంపై పడవేసి ఉంది. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులందరూ హైదరాబాదులో ఉండటంతో విలువైన సామగ్రిని అక్కడి తీసుకెళ్లారు. గతేడాది

చిందర వందరగా పడవేసిన సామగ్రి

కూడా ఇదే ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదును తీసుకెళ్లారు. అయితే అప్పట్లో బీరువాలో నగదు, బంగారాన్ని తీసుకెళ్లారు. మరో లాకర్ రావపోవడంతో అందులోని విలువైన బంగారం, వెండిని వదిలేసి వెళ్లారు. చోరీ జరిగి ఏడాది గడవముందే మళ్లీ చోరీకి యత్నించారు. ఇంట్లో ఎవరు లేని విషయాన్ని గమనించి ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని ఎస్ఐ తెలిపారు. ఇంట్లో విలువైన వస్తువులు లేక పోవడంతో పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఏడాది లోపే రెండుసార్లు ఇదే ఇంట్లో చోరీ జరగడంపై చుట్టుపక్కల వారంతా భయాందోళనకు గురవుతున్నారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

- పది మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - రేపల్లె

ట్రాక్టర్ అదుపు తప్పి కాలువలో బోల్తా కొట్టిన ఘటనలో 10 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కామరాజుగడ్డ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కొల్లిపర మండలం దావులూరు పాలెం , నగరం మండలం ధూళిపూడి పంచాయతీ



గాయపడిన మహిళ

గాయపడిన వృద్ధుడు

పరిధిలోని ఉయ్యూరువారిపాలెంకు చెందిన పలువురు కొలువుల కోసం వచ్చారు. అందులో భాగంగా మోర్తల శ్రీ ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. కష్ణా నది స్నానమాచరించి తిరిగి వస్తున్నారు. అదే సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆ సమయంలో 30 మంది ఉన్నారు. అందులో పదిమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిపై గుంతలకు మరమ్మతులు

ప్రజాశక్తి-కొండపి

కొండపి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆర్అండ్‌బి రహదారిపై కొద్దిపాటి వర్షానికే నీరు చేరుతోంది. దీంతో వాహన చోదకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం గురించి ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. నీటిలో రాకపోకలు సాగించే సమయంలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి బోల్తా కొట్టడంతో వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. ఈ విషయాన్ని గమనించి కొండపి సర్కిల్ సిఐ పాండు రంగారావు జెసిపి సాయంతో ఆర్అండ్‌బి రోడ్డుపై ఉన్న గుంతలను శుక్రవారం పూడిపించారు. రహదారిపై గుంతలు పూడిపించడం పట్ల ప్రజలు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 1,011 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 959 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 52 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర కిలో రూ.320, అత్యల్ప ధర రూ.256.05 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

- యువకుడు మృతి

ప్రజాశక్తి- అద్దంకి

ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీనివాసనగర్ గ్రామ సమీపంలో నామ్ ఎక్స్‌ప్రెస్‌వే రోడ్డుపై గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బల్లికురవ మండలం ఎస్ఎల్. గుడిపాడుకు చెందిన జగదీష్ (18) తాను మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌లో ఉప్పలపాడు గ్రామంలోని తన మేన మామ ఇంటికి తరలిస్తున్నాడు. అదే సమయంలో నరసరావుపేట నుంచి అద్దంకి వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో జగదీష్

మృతిచెందిన జగదీష్

అక్కడికక్కడే మతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ రవికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి పరిశీలించి వివరాలను సేకరించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఇంట్లో బంగారం మాయం!

అపస్మారక స్థితిలో బాధితురాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంట్లో బంగారు నగలు మాయమైన ఘటన ఒంగోలు నగరం అంబేద్కర్ భవన్, ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం వెలుగుచూసింది. సదరు వృద్ధురాలు అపస్మారక స్థితిలో ఉండటంతో ఎవరైనా వృద్ధురాలిపై దాడి చేసి.. నగలు చోరీ చేశారా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వృద్ధురాలి బంధువుల కథనం ప్రకారం.. విశ్రాంత పోస్టల్ ఉద్యోగి తిరుమలశెట్టి సుబ్బారావు భార్య పార్వతమ్మ ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. ఆమె భర్త గతంలోనే మరణించటంతో వచ్చే పింఛను డబ్బులతో జీవనం సాగిస్తోంది. ఆమె బంధువులు రెండు రోజులకొకసారి వచ్చి పరామర్శిస్తూ ఉంటారు. శుక్రవారం తెల్లవారుజామున బంధువులు ఇంటికి వచ్చి చూసేసరికి.. వృద్ధురాలి ఇంటి బయట తలుపు గడియ పెట్టి ఉంది. వృద్ధురాలు లోపల అపస్మార స్థితిలో ఉంది. ఆమె మెడలోని బంగారు ఆభరణాలు కూడా కనిపించక పోవడంతో బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఇంట్లో ఆధారాలు సేకరించారు. బంధువులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పది సవర్ల వరకు బంగారం కనిపించడం లేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

ప్రజాశక్తి -కొనకనమిట్ల

విద్యుత్ షాక్‌తో ఏడు గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన మండల పరిధిలోని గొట్లగట్టు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది.

మృతిచెందిన గేదెలు

అందిన వివరాల ప్రకారం...గొట్లగట్టు గ్రామానికి చెందిన వీరయ్యకు చెందిన మూడు గేదెలు, బత్తుల చిన మాలకొండయ్యకు చెందిన ఒకటి, మోరబోయిన కన్నయ్యకు చెందిన ఒకటి, ఉప్పుటూరి శ్రీనుకు చెందిన ఒకటి, బత్తుల ఆంజనేయులు చెందిన ఒక గేదెను మేత కోసం పొలం తోలు కెళ్లారు. గేదెలు మేత మేస్తున్న సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగడంలో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కొక్క గేదె రూ.50 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. గేదెలు మృతిచెందటంతో తమ కుటుంబ జీవనాధారం కోల్పోయామని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

వెంకటేశ్వర స్వామి గుడిలో చోరీ

ప్రజాశక్తి-మార్కాపురం

మండల పరిధిలోని రాయవరం పంచాయతీ పరిధిలోని రైల్వే స్టేషన్ వద్ద శ్రీ వెంకటేశ్వర స్వామి గుడిలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు పూజారి గదిలో కిటికీ పగలగొట్టి లోపల ఉన్న గుడి తాళాలను తస్కరించారు. అనంతరం గుడి తలుపులు తెరిచి గర్భగుడిలోని వెండి సెటారు, ఇతర వెండి ఆభరణాలను అపహరించారు. చోరీకి గురైన వస్తువుల విలువ లక్షకు పైగా ఉంటుందని అంచనా.

పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - మద్దిపాడు

మద్దిపాడు ఎస్‌సికాలనీలో పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు రూరల్ సిఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, నాగులుప్పలపాడు ఎస్ఐ రామానాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డుల ఊసేదీ.?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రబీ సీజన్ పూర్తయి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నప్పటికీ కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ప్రస్తావన ఎక్కడా కనిపించడం లేదు. నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ సీజన్ పనులకు సమాయత్తం అవుతున్నారు. చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు మండలాల్లో ఈపాటికి రైతులు భూములను కౌలుకు అప్పగించడంతో కౌలు రైతులు పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. కౌలు గుర్తింపు కార్డుల కొరకు ప్రభుత్వం మార్గదర్శకాలు నిర్దేశించినప్పటికీ నేటికీ గుర్తింపు కార్డులు జారీ చేయటానికి అధికారులు ఇంకా ఎన్నికల మూడ్‌లోనే ఉన్నట్లు కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు పూర్తయి నూతన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఉన్నతాధికారుల నుండి కౌలు గుర్తింపు కార్డులకు అనుమతులు లభించే సమయానికి కౌలుదారులు సాగు పనులు చేపట్టనున్నట్లు రైతులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారులు ప్రస్తుతం మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50శాతం రాయితీపై అందిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో 70 శాతం పైగా భూములు కౌలుదారులే సాగు చేస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కౌలుదారులు పొందటానికి తప్పనిసరిగా గుర్తింపు కార్డు అవసరమై ఉంది. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో రైతులు ఎక్కడ దూర ప్రాంతాల నుండి ఫోన్ల ద్వారా కౌలు సొమ్ము తీసుకుని కౌలుకు ఇస్తూ ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో రైతులు పచ్చిరొట్ట విత్తనాలు తీసుకొని కౌలుదారులకు అప్పగించడానికి కూడా అవకాశం లేదు.

కౌలు రైతు పొలంలో దుక్కులు దున్నుతున్న ట్రాక్టర్

జిల్లాలో 4.75 లక్షల ఎకరాల్లో 50వేల మంది కౌలురైతులు

వ్యవసాయ అధికారుల నుండి వస్తున్న సమాచారం మేరకు జిల్లాలో 4.75లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా దానిలో 50వేల మంది కౌలు రైతులు భూములను సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరందరికీ ప్రభుత్వం నుండి కౌలు గుర్తింపు కార్డులు అందించాల్సి ఉంది. ఈ గుర్తింపు కార్డుల ద్వారానే కౌలు దార్లకు పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, వ్యవసాయ పరికరాలు తదితర సదుపాయాలు అమలవుతూ ఉంటాయి. ప్రతి ఏట ఏప్రిల్, మే నెలలో కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ప్రకటనల ద్వారా తెలిపేవాళ్లు. కానీ ప్రస్తుతం మే నెల పూర్తికా వస్తున్నప్పటికీ గుర్తింపు కార్డుల వ్యవహారం ఎక్కడ కనిపించడం లేదు. దీంతో కౌలు రైతుల్లో ఆందోళన నెలకొంది. అనేక మంది కౌలు రైతులు గుర్తింపు కార్డులపై వివిధ బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకొని వాటిని తిరిగి చెల్లిస్తున్నారు. మరుసటి ఏడాది తీసుకున్న గుర్తింపు కార్డుతో వడ్డీ చెల్లించి లోను తిరగరాయించుకోవడం చేస్తుంటారు. కానీ ప్రస్తుతం గుర్తింపు కార్డు లేకపోవడం వల్ల ఏడాది పూర్తి కావస్తుండటంతో వడ్డీ లేని రుణానికి బదులు కాల పరిమితి పూర్తయితే పూర్తి వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని కౌలు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఎన్నికల ఫలితాలు, నూతన ప్రభుత్వ విధానాలతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు అందించేందుకు మార్గదర్శకాలు విడుదల చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుచున్నారు.

ప్రభుత్వ విధానాల వల్లే చేనేతల ఆత్మహత్యలు

ప్రజాశక్తి - రేపల్లె

ప్రభుత్వాలు చేనేత పరిశ్రమ పట్ల అవలంభిస్తున్న విధానాల కారణంగా ఉపాధి లేక చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆరోపించారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకు పోయిందని అన్నారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు లేక అప్పుల పాలవుతున్నారని అన్నారు. చేనేతపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు అప్పులు తీర్చే మార్గం లేక అర్ధాకలితో బతుకు సాగిస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా పెద్దవడుగూరుకు చెందిన కుళ్ళాయప్ప (40) అనే చేనేత కార్మికుడు సోమవారం ఆత్మహత్య చేసుకోగా సత్యసాయి జిల్లా ధర్మవరంకు చెందిన చేనేత కార్మికుడు శీలా బాల చౌడయ్య (29) బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నూలు, రంగులు, రసాయనాలు, వస్త్రాలపై 47శాతం పన్ను విధించడంతో చేనేత వస్త్రాల అమ్మకాలు పడిపోయి కార్మికులకు పనిలేకుండా పోయిందన్నారు. ఆత్మహత్యలకు గురైన చేనేత కార్మిక కుటుంబాలకు రూ.50లక్షల వంతున ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామ కోటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు సిహెచ్ శివశంకర్ పాల్గొన్నారు.

సమావేశంలో చేనేత నాయకులు గొట్టుముక్కల బాలాజీ

కాంగ్రెస్ అధిష్టాన సహకారం లేదు : అంజిబాబు

ప్రజాశక్తి - బాపట్ల

కాంగ్రెస్ అధిష్టానం నుండి తనకు ఎలాంటి ఎన్నికల నిధులు అందలేదని కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి గంటా అంజిబాబు అన్నారు. తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానం తన విషయంలో మాట తప్పిందని అన్నారు. తాను మోసపోయినప్పటికీ ఏనాడూ తాను పార్టీని మోసం చేయలేదని అన్నారు. డబ్బే ప్రధానంగా పనిచేసిన రాజకీయ పార్టీల మధ్య పోటీలో కాంగ్రెస్ నిజాయితీగా ఎన్నికల్లో మార్పు కోసం పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు కాంగ్రెస్ పోల్ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారం సాధించడమే తమ ధ్యేయమని అన్నారు. ఇండియా వేదిక అధికారానికి వచ్చే అవకాశం ఉందని అన్ని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. అబద్ధాలను అభివృద్ధిగా చెప్పుకుంటూ నరేంద్ర మోడీ పదేళ్లు కొనసాగించిన పాలనకు రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ధోనేపూడి దేవరాజు, దండు రేణుక, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గంటా అంజిబాబు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎం కొండయ్య

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

జూన్ 4న జరుగునున్న ఓట్ల లెక్కింపులో ఎజెంట్లు, ముఖ్య నేతలు అప్రమత్తంగా ఉండాలని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యలయంలో ఓట్ల లెక్కంపుపై టిడిపి నేతలతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ విధి విధానాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఓట్ల లెక్కంపు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. సీనియర్ నేతల అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, వేటపాలెం అధ్యక్షులు బొగ్గుల పార్థసారథి, చీరాల రూరల్ అధ్యక్షులు గంజి పురుషోత్తం, డేటా నాగేశ్వరరావు, కర్ణ శ్రీనివాసరావు, కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య, కొమ్మనబోయిన రజిని, కౌతరపు జనార్ధనరావు, కొండ్రు రత్నబాబు, జనసేన నాయకులు గూడూరు శివరామప్రసాదు, మామిడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 2001-02 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. వేసవి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన అప్పటి విద్యార్థులు తాము చదివిన పాఠశాలకు కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈపాటికే పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ద్వారా పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు అప్పటి ప్రధాన ఉపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, హెచ్‌ఎం మాచర్ల మోహనరావును షాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరుకూరులో అన్నదానం

భక్తులకు అన్నదానం

ప్రజావక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరు శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ స్వామివార్లకు అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం కనుల పండుగగా జరిపారు. ఈ సందర్భంగా తీర్థప్రసాదం స్వీకరించిన అనంతరం అన్నదానం చేవారు. స్వామివారి దివ్య రథోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో భక్త రంజని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ ఎం నాగయ్య, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనంలో గొట్టిపాటి, అనగాని, ఏలూరి

శ్రీవారిని దర్శించుకున్న ఎంఎల్ఏలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్రంలో టిడిపి అత్యధిక సీట్లు సాధించి చంద్రబాబు సారధ్యంలో ప్రజలు సుఖ సంతోషాలతో, పాడి పంటలతో విరజిల్లాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు పర్చూరు, అద్దంకి, రేపల్లె టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థులు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కలియుగ దైవరం శ్రీ శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు తెలిపారు.

సమావేశంలో పట్టభద్రుల అధ్యక్షుడు ప్రత్తి సుబ్బారావు

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తాం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు నిర్ణయించు కున్నట్లు పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రతి వెంకట సుబ్బారావు తెలిపారు. అనంత భారత్ జీడిపప్పు కొట్టువద్ద పట్టభద్రుల సంఘం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రాథమిక విద్య అభివృద్ధికి ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు రెండు చెక్ బుక్కు పుస్తకాలు, మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలో వెనకబడిన ప్రాంతమైన అక్కయ్యపాలెంలోని హైస్కూల్ మైదానంలో ఓపెన్ స్టేజి ఏర్పాటు చేయుటకు రూ.50వేల సహకారం కోరారని, వారికి ఆర్థిక సహకారం అందించుటకు హైస్కూలు హెడ్మాస్టర్‌కు వాగ్దానం చేసినట్లు చెప్పారు. ఎంఇఒ అడిగిన ఇనుప బీరువ అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం సెక్రటరీ ఎస్‌విఎల్ ప్రసాద్, ఉపాధ్యక్షులు బుర్రా సాంబశివ రావు, డివిఆర్ నాగరాజ్, రావి మస్తాన్‌రెడ్డి, నాగంజనేయులు, చుండూరు బద్రిరెడ్డి, కరణం మురళీకృష్ణ, పూల శ్రీను పాల్గొన్నారు.

శ్రీకనక నాగవరపమ్మ హుండీ లెక్కిస్తున్న భక్తులు

హుండీ ఆదాయం రూ.4.66లక్షలు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని రామన్నపేట పంచాయతీ రావూరుపేట శివారులోని శ్రీ కనక నాగవరపమ్మ హుండీ ఆదాయం శుక్రవారం లెక్కించారు. రూ.4,66,342 వచ్చినట్లు దేవస్థానం ఇఒ బి శ్రీనివాసరావు తెలిపారు. చీరాల డివిజన్ ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ వేణుగోపాలరావు సమక్షంలో గడిచిన 6నెలలకు సంబంధించిన భక్తుల కానుకలు లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పుగుండూరు ఇఒ శ్రీనివాసబాబు, దేవస్థానం మాజీ చైర్మన్ ఎ భానుమూర్తి, మాజీ డైరెక్టర్ బండ్ల బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
శనివారం 25 మే 2024

ఇసుకాసురులు

- విచ్చలవిడిగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రకృతి సంపదైన ఇసుక అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నా డోంట్‌కేర్ అంటూ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఇసుక అక్రమంగా తరలిపోతున్న అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

మండల పరిధిలోని మల్లవరం, వెల్లంపల్లి, నందిపాడు, ఇనమనమెళ్లూరు గ్రామాల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. గుండ్లకమ్మలోకి ఎక్కడికక్కడ ట్రాక్టర్లు, టిప్పర్ లారీలు పోయేందుకు దారులు ఏర్పాటు చేసుకొని అక్రమంగా ఇసుకను తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. మల్లవరం, వెల్లంపల్లి గ్రామాల్లో ప్రొక్లెయిన్ ద్వారా ఇసుక

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

తవ్వకాలు చేపడుతున్నారు. మిగిలిన గ్రామాల్లో కూలీలతో ఇసుక కుప్పలు ఏర్పాటు చేసి ఆ తరువాత బయటకు తరలిస్తున్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మలో ఇసుక కుప్పలు దర్శనమిస్తున్నాయి. నందిపాడులో రాత్రుల్లో మాత్రమే తవ్వకాలు చేస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన వైసిపి నాయకుల కనుసన్నల్లోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్న కలెక్టర్ ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెల్లంపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఇసుక కుప్పలు

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకుంటాం

అనురాధ, తహశీల్దారు

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్నారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకొనేందుకు ఎనిమిది శాఖల అధికారులు పని చేస్తున్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

సైడు కాలువలపై అక్రమ కట్టడాలు..

- కాలువల్లో పేరుకు పోయిన చెత్త
- ముందుకు కదలని నీరు
- రహదారిపై నిల్వ
- రాకపోలకు ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - సిఎస్ పురంరూరల్

సైడు కాలువలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శి రామప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మాజీ ఎంపిపి పాలిశెట్టి భాగ్యమ్మ ఇంటి సమీపంలో డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. దీంతో డిజిపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై మురుగు నీరు చేరింది. ఫలితంగా ప్రజలు అనేక ఇబ్బందులకు

కాలువలోని చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కార్యదర్శి రామప్రసాద్ పంచాయతీ సిబ్బందితో కలిసి డ్రైనేజీని శుభ్రం చేసేందుకు శుక్రవారం అక్కడి వెళ్లారు. డ్రైనేజీ పై అక్రమ కట్టడాలు ఉండడంతో శుభ్రం చేసే అవకాశం లేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. డ్రైనేజీ పై నిర్మించిన ప్రహరీ గోడను పగలగొట్టి శుభ్రం చేశారు. మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా తగు చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ పూడుకు పోయినట్లు గుర్తించారు. గ్రామంలోని ప్రధాన ఆర్అండ్ బి రహదారి కి ఇరువైపులా సైడ్ కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలు తొలగించి పూర్తిస్థాయిలో డ్రైనేజీని శుభ్రం చేసేందుకు వీలు కల్పించాలని కోరుతూ ఆర్ అండ్ బి డిఇకి పంచాయతీ కార్యదర్శి లేఖ రాశారు.

ఆహ్లాదం పంచని పల్లెవనం పార్క్

- ఉదయం పూటే తెరుస్తున్న వైనం
- సందర్శకుల అసంతృప్తి

ప్రజాశక్తి-దర్శి

2018లో దర్శి ఎన్ఎపి కార్యాలయం సమీపాన ఎర్రచెరువు పక్కనే పల్లెవనం పార్కు నిర్మించారు. అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు మూడు కోట్లతో ఈ పార్కును నిర్మించారు. గత ఏడాది వరకూ పార్కులో పిల్లలు ఆహ్లాదకరంగా ఆటలాడుకుంటూ, ఉయ్యాలలూగుతూ, జారుడు బల్లపై జారుతూ, సైక్లింగ్ తొక్కుతూ ఆనందంతో గడిపారు. ప్రస్తుతం ఆ పార్క్‌లోని ఆటలకు సంబంధించిన వస్తువులన్ని చెడిపోయాయి. దీంతో గత కొంతకాలంగా ఈ పార్క్‌ను మూసివేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే మద్దిశెటి వేణుగోపాల్ సహకారంతో పార్క్‌లో అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో పార్కలో మరుగుదొడ్డులు నిర్మించారు. మంచి నీటి ట్యాంక్, చెడిపోయిన వస్తువులకు మరమ్మతులకు చేయించారు. ఫారెస్ట్ ఉన్నతాధికారులు పార్కులోకి వచ్చే పిల్లలకు టికెట్లు పెట్టాలని ప్రతిపాదన పెట్టారు. ఆ ప్రతిపాదనలు అమలు జరగాలంటే టికెట్లు ఇచ్చే సిబ్బంది కావాలి. ప్రస్తుతం ఇక్కడ ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు పనిచేస్తున్నారు.

పల్లెవనం పార్క్ ఇదే...

వారికి ఏడాడిగా జీతాలు చెల్లించలేదు. దీంతో పూడ గడవక వారు ఇబ్బంది పడుతున్నారు. ఫారెస్ట్ అధికారులు టికెట్ల ముద్రణకు చర్యలు తీసుకోలేదు. సిబ్బంది కొరత కారనంగా ఆ ప్రతిపాదన పూర్తిస్థాయిలో అమలు జరగలేదు. ఉదయం పూట మాత్రమే పార్క్‌ను తీస్తున్నట్లు అటవీ శాఖ బిటి అమర తెలిపారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు పెద్దలు సాయంత్రం వేళలో పార్క్‌కు వచ్చి అందులోని వస్తువులను చెడగొడుతున్నట్లు వాచ్‌మెన్ చెప్పారు. జూన్ నుంచి టికెట్లు పెట్టి పార్కును ఉదయం సాయంత్రం తీరుస్తారని అటవీ శాఖ బిటి అమరా తెలిపారు. పిల్లలకు రూ.5, పెద్దలు రూ.10 వంతున టిక్కెట్లు విక్రయించున్నట్లు ఆయన తెలిపారు.

కూరగాయలు కొనుగోలు చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తాం

టిడిపి కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తానని టిడిపి కూటమి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. సాధారణ మహిళకు మార్కెట్‌కు వెళ్లి గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం కూరగాయలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆమె కూరగాయల వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో తాగునీరు అందుబాటులో ఉందా లేదు. పెరిగిన విద్యుత్ ఛార్జీలతో వ్యాపారాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. రాబోయేది కూటమి ప్రభుత్వమే నని వ్యాపారుల సమస్యల పరిస్కారానికి కృషి చేస్తామని వారి హామీ ఇచ్చారు. దర్శి పట్టణంలో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. కౌంటింగ్ టెన్షన్ ఏమాత్రం లేకుండా ప్రశాంతంగా కూరగాయలు కొంటూ ప్రజలతో మాట్లాడం అందరినీ ఆకట్టుకున్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని పెట్లూరు గ్రామ సర్పంచి ఆరెతోటి ఝాన్సీరాణి పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ తన కున్న దాంట్లో ఎంతో కొంత పేదలకు సహాయం అందించాలనే ఉద్ధేశంతో పేదలకు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసురత్నం పౌండేషన్ వ్యవస్థాపకుడు ఆరెతోటి బాబూరావు, నాయకులు కందిమళ్ల లక్ష్మీనారాయణ, మూలె రామారావు పాల్గొన్నారు.

నేడు శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణం

ప్రజాశక్తి - మద్దిపాడు

మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి దామా నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 18 నుంచి 28 వరకూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, రాత్రి 8 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నారా నాగిరెడ్డి కోరారు.

గజవాహనంపై శ్రీవేణుగోపాలుడు

ప్రజాశక్తి - నాగులప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరులో వేంచేసియున్న శ్రీరక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గజవాహనంపై శ్రీవేణుగోపాలస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆళ్వారాజుల స్వామి సమక్షంలో ఎదురకోల నిర్వహించారు. ఎదురుకోల విశిష్టత గురించి పూజారి దీవి శ్రీధర్ బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఇఒ మీనిశెట్టి శ్రీనివాసరావు, ట్రస్ట్ కమిటీ చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు , ఆలయ సిబ్బంది సుబ్బారావు,వేణు ,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంతా కల్తీమయం

- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పశ్చిమ ప్రాంతంలో ప్రతి వస్తువు కల్తీమయంగా మారింది. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న ప్రాంతం కావడంతో కల్తీ రాయుళ్లకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. నాసిరకం వస్తువులు, కల్తీ ఆహారాలను ప్రజలకు అంటగడుతూ లాభాలు గడిస్తున్నారు. ప్రజలు మాత్రం వాటిని వినియోగించుకొని వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసరాలు, నూనెలు, నెయ్యి తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏది కొనాలన్నా భారంగానే ఉంది. ఇదే అదనుగా కల్తీ వ్యాపారులు విజృంభిస్తున్నారు. ఆయా వస్తువులను కల్తీ చేస్తూ లాభాలు గడిస్తున్నారు. గతంలో అధికారులు తరచూ తనిఖీలు చేస్తుండేవారు. దీంతో ఎక్కడో ఓ దగ్గర మాత్రమే కల్తీలు జరుగుతుండేవి. అయితే ఇప్పుడు తనిఖీలు జరగడం లేదు. దీంతో కల్తీలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. కల్తీల దెబ్బకు ఇంట్లో తయారు చేసుకునే పదార్థాల వల్ల కూడా పట్టణ ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. పండుగల సమయంలో కల్తీలు మరింత తీవ్రం అవుతున్నాయి. కల్తీలు ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నా వ్యాపారులకు పట్టడం లేదు. పాలు, నెయ్యి, నూనెల కల్తీలతో కేన్సర్ తదితర తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కల్తీ ఆవు నూనె వల్ల ఇటీవల ఢిల్లీలో 33 మంది డ్రాప్సీకా అనే కాలేయ సంబంధిత వ్యాధి బారినపడ్డారు. వంటనూనె, నెయ్యి, కొబ్బరినూనె వంటి వాటిని ప్యాకింగ్, ముద్రణ వివరాలు లేకుండా విక్రయించకూడదన్న నిబంధన

కల్తీ నూనెతో తయారు చేసిన స్వీట్లు

ఉంది. వీటి లూజు విక్రయాలపై పూర్తి నిషేధం ఉంది. అయితే పశ్చిమ ప్రాంతంలో మాత్రం లూజు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పండుగల సమయంలో నెయ్యి, వంటనూనె వాడకం అధికంగా ఉంటుంది. కేజీ నెయ్యి రూ.800 వరకూ ఉండటంతో కల్తీరాయుళ్ల దృష్టి నెయ్యిపై పడింది. పిండి వంటల్లో వాడే బెల్లంలో 90 శాతం కల్తీనే

కల్తీ నూనెతో తయారు చేస్తున్న చికెన్ ఫ్రై

ఉంటుంది.

ఫిర్యాదు చేసుకునే అవకాశం..

సవరించిన చట్టం ప్రకారం స్వీట్లు, పిండి వంటలు పాడైతే కూడా ఫిర్యాదు చేసుకోవచ్చు. గతంలో ఇటువంటి నేరాలకు పాల్పడిన వారికి జరిమానాలతో సరిపెట్టేవారు. 2019 సవరించిన చట్టప్రకారం రుచిగా లేని, గడువులోపే పాడైపోయే వాటిని అమ్మితే రూ.5 లక్షల జరిమానా. ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సవరణలు చేసింది. పదార్థాలు కొనుగోలు చేసినప్పుడు రశీదు తీసుకుంటేనే ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది.

పిండి వంటల్లోనూ కల్తీలు..

ప్రస్తుతం ఎక్కువమంది సంప్రదాయ వంటలను స్వీట్ల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. పిండి వంటల తయారీలో ఎక్కువశాతం కల్తీ నూనె, నెయ్యినే వాడుతున్నారు. చిరు వ్యాపారులు రోడ్లపై బళ్లు పెట్టుకుని అరిశెలు, ఇతర పిండి వంటలు విక్రయిస్తున్నారు. వీటి నాణ్యతా ప్రమాణాలను అంచనా వేయడం, కల్తీలను అరికట్టడం అధికారులకు సమస్యగా మారింది. సవరించిన ఆహార భద్రతా ప్రమాణాల చట్ట ప్రకారం అమ్మకానికి ఉంచిన స్వీట్లపై తయారీ వివరాలను ముద్రించాలి. అయితే జిల్లాలో ఏ ఒక్క వ్యాపారీ పిండి వంటలపై వివరాలను ముద్రించడం లేదు.

కల్తీ ఇలా..

గోధుమ పిండిలో మైదా, శనగపిండిలో బఠాణీ పిండి కలుపుతున్నారు. పిచ్చికుసుమ గింజలు కలిసిన ఆవు నూనెను వంటల్లో వాడుతున్నారు. నెయ్యిలో ఆవు ఎముకల నుంచి తీసిన తేటను కలుపుతున్నారు. బరువు కోసం బంగాళ దుంపలను ఉడికించిన నీటిలో కలుపుతున్నారు. స్వచ్ఛమైన నెయ్యి చలికాలంలో గడ్డ కడుతుంది. కానీ మార్కెట్లో లభించే నెయ్యిలో ఇటువంటి గుణం కనిపించడం లేదు. కందిపప్పులో కేసరిపప్పు అనే పదార్థాన్ని కలుపు తున్నారు. ఇది తినడం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అరిశెలు, ఇతర స్వీట్ల తయారీ సమయంలో వాటి రంగు మరింత ఆకర్షణీ యంగా కనబడటానికి మెటానిల్ అనే కెమికల్ వాడుతుం టారు. ఇవి కలిసిన పదర్థాలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతిని క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. అలాగే హోటళ్లలో నాసిరకం పదార్థాలను, నిల్వ ఉన్న చికెన్ వాడుతున్నారు. రంగులు పూసి, వేపుళ్లు చేసి అందిస్తు న్నారు. దీనివల్ల కూడా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

దాడులు నిర్వహిస్తున్నాం

గరికపాటి ప్రభాకరరావు, కల్తీ ఆహార నియంత్రణ జిల్లా అధికారి, ఒంగోలు

జిల్లాలో స్వీట్ షాపులు, ఐస్‌క్రీములు షాపులు, హోటళ్ల దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నాం. నకిలీల ఆట కట్టిస్తున్నాం. ఆహార సంబంధిత వ్యాపారాలు నిర్వహించే వారు నిబంధనల ప్రకారం బిల్లులు, టాక్స్ ఇన్వాయిస్ ఫుడ్ లైసెన్స్ నెంబర్‌ను తప్పనిసరిగా ముద్రించాలి. స్వీట్ల తయారీదారులు వాటిపై తయారీ వివరాలను ముద్రించాలి. నిబంధనలు పాటించని వారిపై కేసులతో పాటు రూ.2 లక్షల వరకూ జరిమానా విధించే అధికారం ఉంది. ఇక లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారికి 6 నెలల జైలు శిక్షతో పాటు, రూ.5 లక్షల వరకు జరిమానా విధించే అధికారం ఉంది.

పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలతో పోలీసులు

ఆకవీడులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో శుక్రవారం గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్, రాచర్ల ఎస్ఐ హరిబాబు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ దాసరి ప్రసాద్ తెలిపారు. సమస్యాత్మకమైన ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తగా సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో కొమరోలు ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచి ముసలారెడ్డి

పెళ్లి ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండ పాలెం మండలం మురారి పల్లి పంచాయతీ పరిధి లోని వేగినాటి కోటయ్య నగర్‌లో పేదలైన ఆలేటి రవికుమార్, పాపులమ్మల కుమార్తె పెళ్లి ఖర్చులకు గాను మురారిపల్లి సర్పంచ్ ఏకుల ముసలారెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం స్వయంగా ముసలారెడ్డి వేటినాటి కోటయ్య నగర్‌లోని పెళ్లి కుమార్తె ఇంటికి వెళ్లి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. తనవంతు సాయంగా రూ.20 వేలు పెళ్లి కుమార్తె తల్లి పాపులమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బుజ్జి, వైసీపీ నాయకులు భూమిరెడ్డి వెంకటరెడ్డి, ఆవుల మల్లారెడ్డి, వై పుల్లారెడ్డి, ఆవుల మంత్రు నారాయణరెడ్డి, దావీదు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరంలో క్యారమ్ ఆడుతున్న పిల్లలు

ఇంజనీరింగ్ పితామహుడు 'విశ్వేశ్వరయ్య'

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, స్వామి వివేకానంద జీవిత చరిత్రల గురించి అర్చకులు శివరామకృష్ణ పిల్లలకు వివరించారు. శిక్షణా కార్యక్రమమైన 10వ రోజు ప్రారంభంలో పిల్లల చేత కథలు చెప్పించడం కథలు చదివించడం చేశారు. తరువాత చదరంగం, స్కిప్పింగ్, క్యారమ్, ల్యూడో స్నేక్ ఆటలను ఆడించారు. అనంతరం గలివర్ సాహస యాత్రల గురించి టెలికం విశ్రాంత ఉద్యోగి షేక్ రహంతుల్లాబా క్లాసు బోధించారు. ఈ శిబిరంలో 13 మంది పిల్లలు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు కే సత్యనారాయణ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

మానసిక ప్రశాంతతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మానసిక ప్రశాంతత ఉన్నప్పుడే మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడని యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ యాదిద్య దేవర అన్నారు. శుక్రవారం ప్రపంచ స్కిజో ఫ్రెనియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో ప్రజలు అధికంగా ఫోన్లు, కంప్యూటర్లు, పని వత్తిడిలో పడి యాంత్రిక జీవనం గడుపుతున్నారన్నారు. తద్వారా టెన్షన్, డిప్రెషన్ అధికమై రక్తపోటు, గుండె పోటు, మధుమేహం వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఆరోగ్యకర జీవన శైలి లేక వివిధ రకాల మానసిక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగా వంటివి చేయాలని సూచించారు. మనదేశంలో 15 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సుగల యువత మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని తెలిపారు. మానసిక రుగ్మత చికిత్స ఆలస్యమైతే 15 సంవత్సరాలు ముందే మరణిస్తారని తెలిపారు. భారతదేశంలో 50 లక్షల మంది వ్యాధి బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా దినోత్సవం సందర్భగా మానసిక వైద్యం గురించి అవగాహన కల్పించేందుకు మే 20 నుంచి 27 వరకు స్కిజోఫ్రెనియో అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మానసిక వ్యాధి పట్ల అవగాహన, వ్యాధి నిర్ధారణ, వ్యాధి నుంచి బయటపడటం ఎలా, వైద్యం అందకపోతే పరిస్థితి ఏమిటి అనే అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలో ఒంగోలు నుంచి మానసిక వైద్యనిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ వచ్చి నెలలో రెండవ, నాలుగవ శుక్రవారం చికిత్సలు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైపాలెంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో ఈ నెల 25న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు యర్రగొండ పాలెం విద్యుత్ ఏఈ టి అల్లూరయ్య శుక్రవారం తెలిపారు. శనివారం యర్రగొండపాలెం, అయ్యంబొట్లపల్లి, మిల్లంపల్లిల్లో గల 33 /11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్‌ల మెయింటెనెన్స్ ఉన్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

'వెలిగొండ'కు నికర జలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వెలుగొండ ప్రాజెక్టుకు నికర జలాలు కేటాయించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చిన్నగుడిపాడు సమీపంలోని అడ్డరోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం డివిజన్ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వెలుగొండ రెండో టన్నెల్‌పై సిమెంట్ దిమ్మెలు బిగించకపోవడంతో టన్నెల్‌కే ప్రమాదమన్నారు. బొమ్మలాపురం, వైచెర్లోపల్లి చెరువులకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. దోర్నాల సమీపంలోని ఐనముక్కల ఇలాకాలోని బైనన్న గూడెం దగ్గర తీగలేరు కాలువపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం జూన్ 12వ తేదీ పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లోని తహశీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, గోతం వెంగయ్య, షేక్ ఖాసిం, మల్లారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మహేష్, రాజ కృపమ్మ, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలు భేష్

ప్రజాశక్తి - పంగులూరు

తహశీల్దారు కృష్ణ ప్రసాద్

మండలంలో శాంతి భద్రతలు సంతృప్తి కరంగా ఉన్నాయని తహశీల్దారు జిఎస్ కృష్ణప్రసాద్ అన్నారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం లేదని చెప్పారు. ఎన్నికల రోజు ఎలాంటి సంఘటనలు, వివాదాలు లేకుండా జరిగాయని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం నిఘా ఉంచారని తెలిపారు. శాంతి భద్రతలలో అదుపులో ఉన్నాయని అన్నా రు. ఏ పార్టీ గెలిచినా ప్రజలు శాంతియుతంగా ఉండాలని కోరారు. జాతీయ రహదారిపై కొండ మంజులూరు పంచాయతీలోని సర్వే నెంబరు 58/1లోని రెండు ఎకరాల 42 సెంట్లు డొంక పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని, అనేక మంది ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ ఆక్రమణలను వెంటనే తొలగించాలని, లేకుంటే ప్రభుత్వపరంగా ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆక్రమణదారుల వివరాలు సేకరించి వెంటనే తొలగించేందుకు పంచాయతీకి ఆదేశాలు పంపినట్లు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో వ్యవసాయ భూముల్లోని 12 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి వాటిలోని రాగి వైరును గత ఏడాది తీసుకెళ్లిన దొంగలు మళ్లీ ఈ సంవత్సరం కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టడం మొదలుపెట్టారు. మూడు రోజుల క్రితం మండలంలోని పంగులూరు గ్రామంలోని వ్యవసాయ భూముల్లో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి వాటిలోని రాగి వైరును తీసుకెళ్లారు. బేతాళ జాన్, బాచిన చెంచు ప్రసాద్, రాయిని సుబ్బారావు, భారత పెట్రోలియం బంకుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టారు. గత ఏడాది మండలంలోని వివిధ గ్రామాల్లో దొంగలు 12 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టినట్లు పిర్యాదులు ఉన్నాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే రాగి రూ.3,500 విలువ చేస్తుంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టడం వలన రైతుల వ్యవసాయానికి ఇబ్బందిగా మారుతుంది. దొంగలు పగలగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి బిగించాల్సిన విద్యుత్తు అధికారులు నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది 9 నెలల తర్వాత బిగించారు. ఈలోపు పంటలు పూర్తిగా ఎండిపోయి రైతుల నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు మళ్లీ విద్యుత్ దొంగలు విజృంభించి ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టారు. ఈ మేరకు రేణింగవరం పోలీస్ స్టేషన్లో రైతులు ఫిర్యాదు చేశారు.

రాగి వైరు దొంగిలించిన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే

అధికారులు చర్య తీసుకోవాలి

రైతు సంఘం జిల్లా నాయకుడు తలపనేని రామారావు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి రాగి వైరును దొంగిలిస్తున్న దొంగలను తక్షణమే పోలీసులు అరెస్ట్ చేయాలని, కఠినంగా శిక్షించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. గత ఏడాది మండలంలో 12 ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలు పగలగొట్టి తీసుకెళ్లారని, వీటి పరిధిలోని రైతులు పంటలు నష్టపోవాల్సి వచ్చిందని చెప్పారు. పోయిన వాటి స్థానంలో కొత్తవి బిగించాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులదేనని అన్నారు. అధికారులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించి తక్షణమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని డిమాండ్ చేశారు.

శాంతి భద్రతలకు

విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

- ఏఎస్పీ విఠలేశ్వరరావు - చీరాలలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్

ప్రజాశక్తి-చీరాల

రాజకీయ పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు ప్రజలు జూన్ 4న జరుగుతున్న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా, కౌంటింగ్ ముగిసిన అనంతరం ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలకు, ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర రావు హెచ్చరించారు.శాంతిభద్రతలను పరిరక్షించటమే లక్ష్యంగా బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర రావు పర్యవేక్షణలో, జిల్లా ఆర్మడ్ రిజర్వు ఇన్స్పెక్టర్ లు, రిజర్వు పోలీస్ సిబ్బంది మే 24న శుక్రవారం చీరాలలోని గడియారం స్థంభం సెంటర్ వద్ద మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను కట్టడి చేసేందుకు, జన సమూహాలను నిలువరించుటకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.ముందుగా గడియార స్థంభం సెంటర్ లో ఆందోళనకారులు,అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా వార్నింగ్ ఇచ్చుట, అది వినకపోతే పై అధికారుల అనుమతితో భాష్ప వాయువు ప్రయోగించుట, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించుట, లాఠీ చార్జ్ చేపట్టుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయుట. అప్పటికి పరిస్థితి అదుపులోకి రాక పోతే ఫైరింగ్ చేయుట వంటివి డెమో ద్వారా అత్యంత పరిపక్వతతో ప్రదర్శించారు.ఈ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది తెలపటమే అన్నారు.వివిధ రాజకీయ అభ్యర్థులు ఎవరు గెలిచిన, ఓడినా సంయమనంతో వ్యవహరించాలని, సెక్షన్ 144 సి.ఆర్.పి.సి, 30 ఏపీ పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున రెచ్చగొట్టే విధంగా ఏటువంటి వ్యాఖ్యలు చేయరాదని, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించుకోవడానికి అనుమతి లేదన్నారు. కౌంటింగ్ సమయంలో ఘర్షణలకు పాల్పడిన అలాంటివారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీ షీట్స్ కూడా తెరవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పీ బి. ప్రసాద్, సిఐ లు పి. శేషగిరిరావు,సోమశేఖర్, అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, వెల్ఫేయిర్ ఆర్.ఐ శ్రీనివాస్ రెడ్డి,ఎస్సైలు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌లో భాగంగా అల్లర్లు జరిగే తీరును ప్రదర్శిస్తున్న దృశ్యం

మాక్‌డ్రిల్‌లో భాగంగా పోలీసుల కాల్పులు

ప్రారంభానికి నోచుకోని రూ.2కోట్ల విలువైన క్రీడా భవనం

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

ప్రజాశక్తి - పర్చూరు

గ్రామీణ క్రీడాకారులకు శిక్షణనిచ్చి జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం హయాంలో ఎన్టీఆర్ క్రీడా వికాసం పేరుతో రూ.2కోట్ల నిధులతో క్రీడా ప్రాంగణం నిర్మించారు. ఏళ్ల తరబడి ఎలాంటి ఆలనా పాలనకు నోచుకోక నిరుపయోగంగా మారింది. భవనం చుట్టూ చిల్ల చెట్లు, ముళ్ళపదలు అలము కున్నాయి. ఇటీవల ఎన్నికల సందర్భంగా అధికారులు వెనువెంటనే క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణ సమావేశాలు ఈ భవనంలో నిర్వహించారు. దీనివల్ల క్రీడా ప్రాంగణం అధికారులతో కళకళలాడింది. ఎన్నికలు ముగిసిన అనంతరం యథా రాజా తథా ప్రజా అన్న చందంగా మొదటికి వచ్చింది. ప్రస్తుతం పశువులతో ప్రాంగణం దర్శనమిస్తుంది. ప్రాంగణంలో పశువులను తోలటంపై క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి రూ.కోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మించిన క్రీడా ప్రాంగణాన్ని ఉపయోగంలోకి తీసుకుని వచ్చి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బైటమంజులూరులో బెల్ట్ షాపుల జోరు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బైటమంజులూరులో మద్యం ఏరులై పారుతుంది. బెల్ట్ షాపుల ద్వారా గ్రామంలో మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ కొంత మంది డబ్బు సంపాదనకు అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారులు మాత్రం గుడ్లప్పగించి చూస్తున్నారు. గ్రామంలో నాలుగు బెల్ట్ షాపులు నిరంతరం నడుస్తూనే ఉన్నాయి. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుండి రాత్రి 12, ఒంటి గంట వరకు ఎప్పుడు కావాల్సిన మద్యం దొరుకుతుంది. పక్కనే ఉన్న ముప్పవరంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుండి మద్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి ఈ బెల్టు షాపులను నడుపుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఒక్కో సీసపై రూ.50 అదనంగా వసూలు చేసుకుని సొమ్ము చేసుకుంటు న్నారు. గ్రామంలో మద్యం తాగటం వల్ల అనేక మంది కిడ్నీ సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అయినా ఇవేమీ పట్టించుకోకుండా మద్యం షాపులు నడుపుతున్నారు. ఇప్పుడు మద్యం షాపులు నడుపుతున్న వారిలో ఒక వ్యక్తిని గతంలో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయినా మద్యం అమ్మటాన్ని మాత్రం అతను వదిలిపెట్టలేదు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం లేదు. వీరికి రాజకీయ అండదండలు ఉండటంతో ఎవరి మాట వినకుండా బెల్ట్ షాపులు నడుపు తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామంలో కూలి, నాలి చేసుకొని జీవించే పేద ప్రజలు ఈ మద్యం షాపులకు అలవాటు పడి వారి కష్టం ఈ బెల్ట్ షాపులకే దారపోస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని గ్రామంలోని నాలుగు బెల్ట్ షాపులను మూసి వేయించాలని, వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన ఎపిడిఇఇ సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో ఎపి డిఇఇ ప్రవేశ పరీక్షలు విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఎపి డిఇఇ సెట్ కళాశాల్లోని టిసిఎస్ ఐయాన్ సెంటర్ నందు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీశ్ బాబు తెలిపారు. పరీక్షకు 240 మందికి 201మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్స్ పరిశీలన


స్ట్రాంగ్‌రూమ్స్ పరిశీలన సందర్భంగా సంతకం పెడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలలో ఈవీఎంలు భద్రపరిచిన రైజ్ ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్స్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.ఎస్.దినేష్‌కుమార్ శుక్రవారం రైజ్ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో వినియోగించిన ఈ.వి.ఎం.లను ఓట్ల లెక్కింపు కోసం ఈ కాలేజీలో భద్రపరచిన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈ ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు కోసం చేస్తున్న కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూములకు వేసిన సీలు, గదుల వద్ద, మొత్తం ప్రాంగణానికీ కల్పిస్తున్న భద్రత వంటి అంశాలను వారితో కలిసి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ రూమ్‌లోకి ఈవీఎంలను తీసుకువెళ్లడానికి, ఏజెంట్లను అనుమతించడానికి ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. లెక్కింపునకు టేబుల్స్, ఫలితాలను ఎప్పటికప్పుడు డిస్‌ప్లే చేసేలా చేస్తున్న ఏర్పాట్లను వారికి వివరించారు. కౌంటింగ్ రోజున ఏజెంట్లకు, సిబ్బందికి ఈ ప్రాంగణంలో కల్పించే ఇతర సదుపాయాలను కూడా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట రాజకీయ పార్టీల ప్రతినిధులు వైసిపి నుంచి దామరాజు క్రాంతికుమార్, కాంగ్రెస్ ప్రతినిధి ఎస్ఎఎ రసూల్ (కాంగ్రెస్), టిడిపి ప్రతినిధి కాలేషా బేగ్, బిజెపి ప్రతినిధి బి.రాజశేఖర్, పోటీ చేసిన అభ్యర్థుల తరపున ఏజెంట్లు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపులో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు బాధ్యత ఏఆర్ఓలదేనని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. అపోహలు, నిర్లక్ష్యం ఉండరాదని అధికారులకు ఆయన సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలలోనే పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సగటున రెండు వేలకు పైగా ఓట్లు ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు మూడు రౌండ్స్ లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బ్యాలెట్ పత్రాలున్న కవర్లను స్కానింగ్ చేసే సమయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఈసీఐ స్థిరమైన నిబంధనలు తెలుసుకుని వాటినే అనుసరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల పరిశీలన సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆరోఓ హ్యాండ్ బుక్‌లను ఏఆర్ఓలు అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. ఈసీఐ మార్గదర్శకాలపై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈటీపీబీఎస్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈసీఐ మార్గదర్శకాలపై పిపిటి ద్వారా అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్, ఉప కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఐటి నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఆమంచిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-చీరాల

చీరాల దళిత డిఎస్పి బేతపూడి ప్రసాద్‌ను అవమానపరిచేలా మాజీ ఆమంచి కృష్ణమోహన్ మీడియా సమావేశంలో మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని, తక్షణమే పోలీసు ఉన్నతాధికారులు ఆమంచిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పేరాలలోని స్థానిక గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో డీఎస్పీపై ఆమంచి వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజాసంఘాల నాయకుల విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. చీరాల నియోజకవర్గంలో దళితులు సుమారు 40 వేల ఓటర్లకు పైగా ఉన్నారని దళితులు పట్ల ఆమంచి ఆది నుండి చిన్న చూపు చూస్తూ వారిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేసేవారన్నారు. గతంలో ఎన్నికల సమయంలో కూడా సాక్షాత్తు జిల్లా ఎస్పీని అసభ్య పదజాలాలతో దుర్భాషలాడిన చరిత్ర ఆమంచిది అన్నారు. ప్రజాసంఘాల నాయకులు కంచర్ల చిట్టిబాబు సభ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోసాల సుధాకర్, ఎన్ మోహన్ కుమార్ ధర్మ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలలోకి

నిర్ణయించిన వ్యక్తులనే అనుమతించాలి..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా

స్ట్రాంగ్‌రూములను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓట్ల లెక్కింపు కేంద్రాలలోకి ముందస్తుగా నిర్ణయించిన వ్యక్తులను మాత్రమే అనుమతించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కలిసి శుక్రవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటుచేసిన సిసి కెమెరాల నిఘా నిరంతరం కొనసాగాలన్నారు. విధులకు నియమించిన అధికారులు, సిబ్బందికి ఒక మార్గం, అభ్యర్థులు వారి ఏజెంట్లు వెళ్లడానికి వీలుగా మరొక మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మార్గాల వద్ద దిక్సూచి బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా ఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, పర్చూరు, రేపల్లె, వేమూరు ఆర్వోలు జి.రవీందర్, వసంతరాయుడు, హేలా షారోన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్ ఎత్తేయాలి..

ఏఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆర్టీసి ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే విధులలో తీసుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి ఎస్ డబ్ల్యూ ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేసేంతవరకు పోరాడుతామని తెలిపారు. ఇటీవల కాలంలో 18వ లోకసభ ఎన్నికలు జరిగాయని, ఎన్నికల్లో పాల్గొన్నారని అనేక మంది ఉద్యోగులను సస్పెన్షన్ చేశారని, వీటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. విఆర్ఏలు, ఆశ ,మధ్యాహ్నం భోజనం, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్లు చిన్న చిన్న ఉద్యోగుల పై సస్పెన్షన్ వేటు వేయడం దారుణమన్నారు ముఖ్యమైన ఎన్నికల సందర్భంగా ఇండోర్ మీటింగ్‌లో అన్ని విషయాలు మాట్లాడుకోవడానికి ప్రజాస్వామ్యంలో హక్కు ఉందన్నారు. సుందరయ్య ఇతర ఉద్యోగులు ఇండోర్ మీటింగ్‌లో అన్ని విషయాలు మాట్లాడుకున్న విషయం పత్రికలో రావటాన్ని ఆధారం చేసుకుని అధికారులు సస్పెన్షన్ వేటువేయటం దుర్మార్గవిషయమన్నారు. అధికారులు ఆలోచించి వెంటనే సస్పెన్షన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అయ్యపరెడ్డి మాట్లాడుతూ సుందరయ్యను కావాలనే అక్రమ సస్పెన్షన్ వేటు వేశారన్నారు. జూన్ 6 తర్వాత ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అన్ని విషయాలపై మాట్లాడుకునే హక్కు ఉందని, ఆర్టీసీ అధికారులు సుందరయ్యపై సస్పెన్షన్ వేటు వేయటాన్ని సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజనల్ కార్యదర్శి పి శ్రీనివాసరావు, శ్రామిక మహిళా కార్యదర్శి పి కల్పన, ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి శేషయ్య, సిఐటియు నగర అధ్యక్షులు సిహెచ్ రాంబాబు, జిల్లా నాయకులు అల్లడి సుబ్బారావు, బ్రహ్మయ్య ,మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.